# డిజిటల్ చెల్లింపుల హవా


క్యూఆర్ కోడ్ స్కానింగ్

## క్రమంగా తగ్గుతున్న నగదు లావాదేవీలు ■ చిరు వ్యాపారుల నుంచి బడా షాపింగ్ మాల్స్ వరకు అదే జోరు

**అల్లిపురం:** చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా..డెబిట్, క్రెడిట్ కార్డులు, సెల్‌ఫోన్ అందుబాటులో ఉంటే చాలు మనకు కావాల్సినవి కొనుక్కోవచ్చు. పాల ప్యాకెట్లు తీసుకోవచ్చు..హోటల్‌లో తినొచ్చు.. వేడివేడి టీ తాగొచ్చు..మార్కెట్లో కూరగాయలు కొనొచ్చు..చేతిలో సెల్ ఉండి అందులో ఫోన్ పే, గూగుల్ పే, యోనో..యాప్‌లు ఉంటే చాలు ఏ సమయంలో అయినా..ఎక్కడైనా మనం సర్వైవ్ అయిపోవచ్చు. ప్రపంచం డిజిటల్ మయంగా మారడంతో వీధి వ్యాపారులు..సందుల్లో బుట్టల్లో కూరగాయలు విక్రయించేవారు కూడా డిజిటల్ పేమెంట్ల పట్ల మక్కువ చూపిస్తున్నారు. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులకు తెర తీస్తున్నారు.

కాలంలో ఎంత మార్పు అంటే ఏకంగా టీ తాగాలన్నా కూడా జనాలు ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేస్తున్నారు. చిన్నపాటి వ్యాపారులు కూడా డిజిటల్ విధానానికి అలవాటు పడ్డారు. అల్లిపురం మార్కెట్‌తో పాటు కెప్టెన్ రామారావు జంక్షన్, వేంకటేశ్వరమెట్ట, కొబ్బరితోట, చావులమదుం, నేరెళ్లకోనేరు జంక్షన్‌తో పాటు నగరంలో అన్ని ప్రాంతాలలోను చివరకు గంపలపై పండ్లు అమ్ముకుని చిన్న చిన్న వ్యాపారులు కూడా ఫోన్ పే అంటున్నారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర థర్డ్ పార్టీ యాప్‌ల సాయంతో ప్రజలు ఆన్‌లైన్ లావాదేవీలను సులభంగా చేస్తున్నారు. తక్కువ పరిధిలో సురక్షితమైన చెల్లింపులు జరుగుతుండటంతో వీటికి ఆదరణ లభిస్తోంది. కిరాణా, నిత్యావసరాలు, పెట్రోలు తదితర సామగ్రి మొదలెట్టి మొబైల్, డీటీహెచ్ రీ చార్జులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, రుణాల చెల్లింపులు, నగదు బదిలీలు తదితర అవసరాలన్నింటికీ వీటినే ఉపయోగిస్తున్నారు.



### బ్యాంకుల్లో డిజిటల్‌కే ప్రాధాన్యం..

బ్యాంకుల్లో కూడా ఎక్కడ చూసినా డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలావరకు తగ్గిపోయాయి. ఎవరికి ఎలాంటి అవసరమొచ్చినా నేరుగా బ్యాంకు నుంచి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. అయితే సేఫ్ బ్యాంకింగ్ అలవరచుకోవాలి. కొంతమంది నకిలీ వ్యక్తులు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటీపీలు, పిన్ నంబర్లు అడిగితే పొరపాటున కూడా చెప్పొద్దని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అలా అడిగితే తక్షణమే ఫోన్ కట్ చేసి బ్యాంకులో సంప్రదించాలని సూచిస్తున్నారు. నగదు లావాదేవీలు పూర్తిగా తగ్గించి ఆన్‌లైన్ ద్వారా చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉన్నాయి.

### బ్యాంకులకు వెళ్లే అవసరం తగ్గింది



యూపీఐ లావాదేవీలు వినియోగం పెరిగిన తరువాత మా పని సులువైంది. కలెక్షన్ కూడా యూపీఐ ట్రాన్సాక్షన్ ద్వారా చెల్లిస్తున్నారు. కౌంటర్ సేల్స్ కూడా ప్రతి రోజు బ్యాంకుకు వెళ్లి చెల్లించాల్సిన పనిలేదు. ఖాతాదారులు నేరుగా మా అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ అవడంతో మాకు లావాదేవీలు సలువు అయ్యాయి.

– బొడ్డేటి ప్రసాద్, విష్ణుప్రియ ఎంటర్‌ప్రైజెస్

### డిజిటల్ చెల్లింపులకే మొగ్గు



కొబ్బరి బొండాలు కోసం వచ్చిన వారు దాదాపు 50 శాతం మంది ఫోన్ పే చెల్లింపులే చేస్తున్నారు. ఫోన్ పే ద్వారా రూ.10 అయినా రూ.100 అయినా ఎంత అమౌంట్ అయినా క్షణాల్లో చెల్లిస్తున్నారు.

–మొల్లేటి రాజు, కొబ్బరి బొండాల వ్యాపారి, అల్లిపురం మెయిన్‌రోడ్డు

### చెల్లింపులు మరింత ఈజీ



గతంలో ఎక్కువ మొత్తంలో షాపింగ్ చేసేందుకు డబ్బులు వెంట తీసుకువెళ్లావాళ్లం. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి వచ్చిన తరువాత ఆ అవసరం లేకుండా పోయింది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా, క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేయడం ఈజీ అయింది.

–పి.సంజీవరెడ్డి, అల్లిపురం

### చిల్లర సమస్యకు పరిష్కారం



డిజిటల్ చెల్లింపుల ద్వారా చిల్లర సమస్యకు పరిష్కారం దొరికింది. ఫోన్‌పే, గుగుల్ పే ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా చిల్లర సమస్యలను పరిష్కారం లభించింది.

– కురిమినెల్లి రమేష్, జిలాబీ బండి వ్యాపారి, శ్రీకెప్టెన్ రామారావు జంక్షన్

### మొదట్లో అవగాహన లేదు



మొదట్లో డిజిటల్ చెల్లింపులపై మాకు అవగాహన ఉండేది కాదు. రాను రాను వాటి విలువ తెలిసింది. డిజిటల్ పేమెంట్లతో నష్టం లేదని గ్రహించాం. ప్రధానంగా చిల్లర సమస్య తీరింది.

–బొడ్డు పోలారావు, పంక్చర్ షాపు యజమాని, కెప్టెన్ రామారావు జంక్షన్

## క్లుప్తంగా

### ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

**కంచరపాలెం:** జ్ఞానాపురం కూడలిలోని వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం భాద్రపద మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డి.వి.ఎస్. సురేష్ ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి అర్చకులు శ్రీకాంత్‌శర్మ కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

### సాగరతీరంలో 'స్వచ్ఛతా హీ సేవా'


ఆర్కే బీచ్ తీరాన్ని శుభ్రం చేస్తున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు

**మద్దిలపాలెం:** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం ఆర్కే బీచ్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బీచ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేసి తీర ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

### ఉత్సాహంగా స్టోరీ టెల్లింగ్


కథ చెబుతున్న స్టోరీ టెల్లర్ సీత

**సీతంపేట :** విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యాభవన్ స్కూల్ సంయుక్తంగా పౌర గ్రంథాలయంలోని మియావాకి సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ ఉత్సాహంగా సాగింది. ప్రముఖ స్టోరీ టెల్లర్ సీత తనదైన శైలిలో పిల్లలకు చక్కని కథలు చెప్పి ఆకట్టుకున్నారు. ఈశాన్య భారతదేశంలోని గారోస్ తెగ సాంప్రదాయ కథలను పిల్లలకు పరిచయం చేశారు. సంగీత వాయిద్యాలు, కళాకృతుల మేళవింపుతో కథకు జీవం పోశారు. క్రాఫ్ట్ యాక్టివిటీలో భాగంగా పిల్లలు పేపర్‌తో నెమలి బొమ్మలు తయారు చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది పిల్లలు పాల్గొన్నారు.

### భర్త అదృశ్యంపై ఫిర్యాదు


ఉమ్మడి సత్యనారాయణ

**మర్రిపాలెం :** తన భర్త అదృశ్యమయ్యాడని భార్య కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కైలాసపురం సింగాలమ్మపురంలో భార్య ఉమ్మడి కుమారి, కుమారుడు, కుమార్తెతో కలిసి నివసించే ఉమ్మడి సత్యనారాయణ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా అతను పనులకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 27న ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయిన సత్యనారాయణ కొద్ది సేపటి తర్వాత పిల్లలు చదువుకునే స్కూల్‌కు వెళ్లి వారికి ఓ లెటర్ ఇచ్చాడు. ఏడాదిగా పనులకు వెళ్లకపోవడంతో అప్పులు చేశానని, తన కోసం వెతకొద్దని అందులో రాశాడు. దీంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ వి.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 3 నుంచి సాగర దుర్గ శరన్నవరాత్రి మహోత్సవాలు

**నవరాత్రుల్లో పాతపోస్టాఫీస్ ఫెర్రీ నుంచి బోటు సౌకర్యం**

**అల్లిపురం:** యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలను అక్టోబర్ 3వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. 3వ తేదీ ఉదయం 9.15 గంటలకు కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 3వ తేదీన బాల దుర్గాదేవిగా, 4న గాయిత్రి దేవిగా, 5న అన్నపూర్ణదేవిగా, 6న భువనేశ్వరిదేవిగా, 7న రాజరాజేశ్వరిదేవిగా, 8న లలితాదేవిగా, 9న సరస్వతిదేవిగా, 10న శాకాంబరి దేవిగా, 11న చండీదేవిగా, 12న సాగర గిరి కనకదుర్గదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 4.45 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు ప్రథమపూజ, బాలభోగం నుంచి సాయంత్రం 6.30 గంటలకు పంచనేత్ర, నక్షత్ర హారతితో పూజాధికాలు ముగుస్తాయన్నారు.


అలంకరణలో సాగర గిరి కనకదుర్గమ్మ

**బోటు సౌకర్యం..**

అమ్మవారిని తొమ్మిదరోజుల పాటు దర్శించుకునే నిమిత్తం పాతపోస్టాఫీసు దరి ఫెర్రీ నుంచి యారాడ కొండ వరకు బోటు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సౌకర్యం ఉంటుందన్నారు. విశాఖ నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

## అంకోస నూతన కార్యవర్గం


అంకోస కొత్త,పాత కార్యవర్గ సభ్యులు

**మహారాణిపేట:** ఆంధ్రా మెడికల్ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (ఎ.ఎం.సి.ఓ.ఎస్.ఎ) నూతన కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించింది. ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ వద్ద ఉన్న అంకోశాలో నూతన కార్యవర్గం పాత కార్యవర్గం నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించింది.అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.కె.ఇ. అప్పారావు, కార్యదర్శిగా డాక్టర్ పి.వి. సుధాకర్, కోశాధికారిగా డాక్టర్ ఐ.వాణిత తదితరులు ఎన్నికయ్యారు. వీరిని వైద్యులు వి.చంద్రశేఖరం, ఎస్.వి.ఆదినారాయణ, టి.రవిరాజ్, ఇ.పెదవీరరాజు, కె.వెంకటేశ్వర్లు, జి.టి.వి. రమేష్ తదితరులు అభినందించారు. పాత కార్యవర్గ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.శ్రీ ప్రభ, కార్యదర్శి డాక్టర్ రామ్మూర్తి తదితరులు నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని వారు అభినందించారు.

## వ్యాయామం, యోగాతో గుండె పదిలం

**ఎంవీపీకాలనీ:** స్థానిక మెడికవర్ ఆస్పత్రిలో ఆదివారం ప్రపంచ గుండెజబ్బుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్, సీనియర్ కార్డియాలజీ డాక్టర్లు కరుణాకర్ పాడి, డాక్టర్ హేమంత్‌కుమార్ బెహరాలు మాట్లాడుతూ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం గుండెను పదిలంగా, ఆరోగ్యకరంగా చూసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి రోజూ వ్యాయామం, యోగా వంటివి చేయాలని, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. తేలికపాటి యోగాసనాలతో గుండెను దృఢం చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం గుండె చికిత్సలకు ఆధునిక వైద్యం ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రిలో అందుబాటులో ఉందని తెలిపారు. బీచ్ రోడ్డులో ఉదయం ఆస్పత్రి వైద్యులు, ఉద్యోగులు హెల్తీ హార్ట్ థీమ్‌తో 2 కిలోమీటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్ కార్డియాలజీ బృందం, రీజినల్ సూపరింటెండెంట్ నరేంద్ర బెండి తదితరులు పాల్గొన్నారు.


బీచ్ రోడ్డులో బెలూన్లు ఎగురవేసి అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యులు

## దగ్ధమైన బోటు యజమానిని ఆదుకోవాలి

**మహారాణిపేట:** అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన మరబోటు యజమానికి ఆర్థిక సహాయం అందించాలని మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు కోరారు. ఆదివారం హార్బర్‌లో నరసింగరావు మీడియాతో మాట్లాడుతూ పూడిమడక సముద్ర తీరంలో మెకనైజ్డ్ బోటు ఇంజన్లో మంటలు చెలరేగడంతో బోటు దగ్ధమైంది. బడే సూర్యనారాయణ చెందిన ఐఎన్డీ ఏపీ వీ5 ఎంఎం294 నంబర్ గల బోటు దగ్ధమవడంతో రూ.36 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందన్నారు. అదృష్టవ శాత్తు మత్స్యకారులు సముద్రంలోకి దూకి ప్రాణాలు దక్కించుకున్నారన్నారు. ఇంకో బోటు 683 తారసపడడంతో ఆ బోటు ఎక్కి ఆదివారం ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్నారన్నారు. ఈ విషయాన్ని మత్స్యశాఖ అధికారులు ద్వారా ప్రభుత్వం జిల్లా యంత్రాంగం దృష్టికి తెచ్చామన్నారు. అన్ని విధాలుగా నష్టపోయిన బోటు ఓనరుకు, మత్స్యకారులకు చేయూత నివ్వాలని నరసింగరావు కోరారు. కార్యక్రమంలో మరపడవల సంఘం ఉపాధ్యక్షుడు గరికిన పరుశురాం, కార్యదర్శులు ఎస్. గురుప్రసాద్, మున్నం బాలాజీ, 37వ వార్డు జనసేన అధ్యక్షుడు గరికిన రవి, మద్దాడ భాను తదితరులు పాల్గొన్నారు.

## 10 కిలోల గంజాయి పట్టివేత

**సీతమ్మధార :** ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాని ద్వారక జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన అజయ్‌కుమార్ (24), నందుకోహరా (28), చంద్రపంగి (25) కలిసి బెంగళూర్‌కు గంజాయి తరలించేందుకు రామాటాకీస్ దరి కంటి ఆస్పత్రి వద్దకు ఆదివారం చేరుకున్నారు. వారి కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు బ్యాగులు తనిఖీ చేయగా రెండు ప్యాకెట్ల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి.వెంకటరమణ నేతృత్వంలో ఎస్ఐ శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్మశానవాటిక శుభ్రం


శ్మశానవాటికను శుభ్రం చేస్తున్న సంఘ సభ్యులు

**మద్దిలపాలెం:** జీవీఎంసీ 15వ వార్డులో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. పాత వెంకోజీపాలెం శ్మశానవాటికలో తుప్పలు, చెత్తను సంఘ ప్రతినిధులు తొలగించారు. దారిని శుభ్రం చేశారు. జీవీఎంసీ తరపున మినీ బాబ్‌కాట్‌తో శ్మశానవాటికను శుభ్రం చేయించారు.

## గౌడ కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలి

**డాబాగార్డెన్స్:** సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న గౌడ కులస్తులను గౌడ కుల కార్పొరేషన్ ద్వారా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని ఉత్తరాంధ్ర గౌడ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. విశాఖ జిల్లా గౌడ సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల గౌడ సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గౌడ సంఘీయులు మాట్లాడుతూ గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న పలు అంశాలు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామని, సమస్యలు పరిష్కరించడమే గాక అన్ని విధాలా ఆదుకుంటామని సానుకూలంగా స్పందించారని చెప్పారు. అలాగే ఎంపీ భరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి కృష్ణబాబు, పలువురు కూటమి ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలు పరిష్కరించమని కోరామన్నారు. సమావేశంలో కామన వెంకట సుబ్బారావు, మార్గాన రామారావు, జెర్రిపోతుల ప్రసాద్, అత్తిలి శంకరరావు, దీవి నారాయణరావు, రేలంగి పెదబాబు, ఏవీఎస్ఎన్ మూర్తి, మట్టా ఆనందరావు, మార్గాన చిన్నయయ, చినబాబు, ఉమశ్రీ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంఘీయులు

## చిరస్మరణీయుడు ఎండూరి

**డాబాగార్డెన్స్:** ఎండూరి కృష్ణమూర్తి చిరస్మరణీయుడని జీపీఎస్ సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు కొనియాడారు. ఉడ్‌యార్డ్ స్ట్రీట్ వాసవీ కళ్యాణ మండపంలో ఆదివారం గీతా ప్రచార సమితి గౌరవాధ్యక్షుడు ఎండూరి కృష్ణమూర్తి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఎండూరి చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గీతా ప్రచారం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కృష్ణమూర్తి సదా చిరస్మరణీయుడన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ వందలాది మంది భక్తులకు భగవద్గీతలోని శ్లోకాలు నేర్పించిన ఘనత కృష్ణమూర్తికే దక్కుతుందన్నారు. విన్నకోట రామ్మూర్తి, నేత్ర వైద్యుడు డాక్టర్ ఏవీఎస్ చెట్టి, మరడాన నాగేశ్వరరావు, జీపీఎస్ ఉపాధ్యక్షుడు పి జగన్మోహనరావు, కార్యదర్శి ఎం.వనజాదేవి తదితరులు కృష్ణమూర్తి ఆధ్యాత్మిక సేవలు కొనియాడారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి కుమారుడు వై.ఉమామహేశ్వరరావు, డి. కనకవల్లీ, జి.లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.


సంస్మరణ సభలో మాట్లాడుతున్న చావలి విశ్వేశ్వరరావు

## ● తీరంలో పడిపోయిన హెచ్చరిక బోర్డులు






సాగర తీరంలో సందర్శకులను అప్రమత్తం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులు కిందపడిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ బోర్డులు నేలకొరిగి సముద్రంలోకి కొట్టుకుపోయే స్థితికి చేరినా.. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## రౌడీషీటర్లు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

**మర్రిపాలెం :** సమాజంలో అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ వి.చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో దూరొద్దని, కుటుంబంతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. అనంతరం వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు.

## రామశర్మకు బాలి స్మారక పురస్కారం

**సీతంపేట :** విశాఖ సంస్కృతి ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బాలి (మేడిశెట్టి శంకరరావు) జయంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. సభాధ్యక్షుడు శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ బాలితో తనకు గల పరిచయం, అనుభవాలు, బాలి చిత్రకళా నైపుణ్యం వివరించారు. అనంతరం కొచ్చెర్లకోట సత్యనారాయణ చేతుల మీదుగా ప్రముఖ కార్టూనిస్ట్ పార్నంది వెంకట రామశర్మకు బాలి స్మారక పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. బాలి కుమార్తె మేడిశెట్టి వైశాలి రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. పురస్కార గ్రహీత రామశర్మ మాట్లాడుతూ బాలు స్మారక పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని, కార్టూన్స్ గీయడంలో తనకు బాలి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఆర్.వి.రమణమూర్తి, వెలమల సిమ్మన్న, చలపతిరావు, సరీజ, యస్.హనుమంతరావు పాల్గొన్నారు.


రామశర్మకు పురస్కారం అందిస్తున్న అతిథులు

## ముగిసిన చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు

**మర్రిపాలెం :** ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో గ్రీన్ క్లెమైట్ టీం ఎన్‌జీవోస్ నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు విజయవంతంగా ముగిశారు. జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ జేఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు మాట్లాడారు. విద్యార్థులు సేవాదృక్పథం అలవరచుకోవాలని సూచించారు. స్వచ్ఛతా హీ సేవా - 2024పై విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు భవిష్యత్‌లో విద్యా సంస్థల్లో నిర్వహిస్తామని తెలిపారు. శాస్త్రవేత్త టీఎస్ఆర్ శ్రీనివాస్, డ్రాయింగ్ టీచర్ మోహన్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోస్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

**మహారాణిపేట:** ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా సర్వ సభ్య సమావేశంలో ఆదివారం విశాఖలో టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ భానుమూర్తి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆచార్యులు, మహిళా విభాగం అధ్యక్షురాలు వెంకట లక్ష్మి పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నగేష్ పట్నాయక్, కార్యదర్శిగా రత్నం, కోశాధికారిగా నాగరత్నంలను ఎన్నుకున్నారు.